క్లుప్తంగా

అభివృద్ధి, సంక్షేమమే వైఎస్సార్ సీపీ ఎజెండా



లబ్బీపేట(విజయవాడతూర్పు): రాష్ట్రంలో అభివృద్ధి, అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడమే వైఎస్సార్ సీపీ ఎజెండా అని 24వ డివిజన్ కార్పొరేటర్ కుక్కల అనిత అన్నారు. వైఎస్సార్ సీపీ ఎంపీ అభ్యర్థి కేశినేని శ్రీనివాస్(నాని), సెంట్రల్ ఎమ్మెల్యే అభ్యర్థి వెలంపల్లి శ్రీనివాసరావుల విజయాన్ని కాంక్షిస్తూ అనిత కస్తూరిభాయిపేట, సీతారామపురంలో మంగళవారం విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె ఐదేళ్లలో డివిజన్‌లో చేసిన అభివృద్ధిని వివరించడంతో పాటు, అందించిన సంక్షేమ పథకాలను తెలియజేశారు. సంక్షేమ పథకాలు నిరంతరాయంగా కొనసాగాలంటే మళ్లీ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి రావాలని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు కొమ్ము చంటి, కుక్కల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

భక్తులందరికీ కుంకుమ ప్రసాదం పంపిణీ చేపట్టాలి



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): అమ్మవారి దర్శనానికి విచ్చేసిన భక్తులందరికీ కుంకుమ ప్రసాదం అందేలా చూడాలని ఈఓ కె.ఎస్.రామరావు ఆలయ అధికారులకు సూచించారు. మహామండపం ఆరో అంతస్తులో జరుగుతున్న కుంకుమ ప్యాకెట్ల తయారీని ఈఓ మంగళవారం పరిశీలించారు. కుంకుమ ప్యాకింగ్ చేస్తున్న విధానం గురించి అడిగి తెలుసుకోవడమే కాకుండా కుంకుమ నాణ్యతను పరిశీలించారు. సుదూర ప్రాంతాల నుంచి విచ్చేసే భక్తులు తొలుత అమ్మవారి దర్శనం ప్రశాంతంగా జరగాలని చూస్తారని, ఆ తర్వాత అమ్మవారి కుంకుమ ప్రసాదం దొరికితే మహా ప్రసాదంగా భావిస్తారని అన్నారు. దేవస్థానం చేపట్టిన ఉచిత కుంకుమ ప్రసాద పంపిణీని మరింత విస్తృతంగా జరిగేలా చూడాలన్నారు. ముఖ్యంగా శుక్ర, శని, ఆదివారాలలో భక్తులందరికీ కుంకుమ ప్రసాదం అందేలా అవసరమైన ప్యాకెట్లను సిద్ధం చేసి ఆలయంలో అందుబాటులో ఉంచాలని సూచించారు. రోజుకు ఎన్ని ప్యాకెట్లు సిద్ధం చేస్తున్నారు.. ఎంత మంది సేవలకు తమ సేవలను అందిస్తున్నారనే వివరాలను ఏఈఓ ఎస్.రమేష్ బాబు ఈఓకు వివరించారు.

వైఎస్సార్ సీపీలో చేరిన టీడీపీ, జనసేన నాయకులు



అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, చేసిన అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై సింగ్‌నగర్ 58, 59వ డివిజన్లకు చెందిన 200 మంది టీడీపీ, జనసేన నాయకులు వైఎస్సార్ సీపీలో చేరారు. సింగ్‌నగర్ ఆంధ్రప్రభకాలనీలోని వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గ కార్యాలయంలో మంగళవారం ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా, డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ, వైఎస్సార్ సీపీ నాయకులు ఎండీ హఫీజుల్లా, నందెపు సురేష్, దేవిరెడ్డి రమేష్ రెడ్డి, కోలా శాంతకుమారి, అమిత్, నేరేళ్ల శివ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

చెక్‌పోస్టు పరిశీలన



గంపలగూడెం(జగ్గయ్యపేట): ఎన్నికల నేపథ్యంలో జగ్గయ్యపేట మండలం గంప్రాయి వద్ద నున్న అంతరాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టును విజయవాడ పార్లమెంటరీ నియోజకవర్గ వ్యయ పరిశీలకుడు వి.జస్టిన్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా ప్రతి వాహనాన్ని తనిఖీ చేయాలన్నారు. అధికారులు మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అదేవిధంగా జగ్గయ్యపేట పట్టణంలోని నియోజకవర్గ ఎన్నికల అధికారి కార్యాలయాన్ని మైలవరం, నందిగామ, జగ్గయ్యపేట నియోజకవర్గ వ్యయ పరిశీలకుడు మదన్‌కుమార్ సందర్శించారు. రికార్డులను పరిశీలించారు.

సీఎం జగన్‌తోనే సువర్ణ పాలన

ఎమ్మెల్యే మల్లాది విష్ణు



64వ డివిజన్‌లో ఓట్లు అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు

పాయకాపురం(విజయవాడరూరల్): అర్హతే ప్రామాణికంగా ప్రతి ఇంట్లో సంక్షేమ లబ్ధిచేకూర్చిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సువర్ణ పాలన సాధ్యమని రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. స్థానిక 64వ డివిజన్ ప్రజాశక్తి నగర్‌లో మంగళవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. స్థానిక కార్పొరేటర్ యరగొర్ల తిరుపతమ్మ, వెలంపల్లి శ్రీనివాసరావు సోదరుడు వెలంపల్లి రాఘవతో కలిసి గడప గడపకు వెళ్లి ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విష్ణు మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వంపై ప్రజలకు అపారమైన నమ్మకం ఉందని, ఆ నమ్మకాన్ని ఎక్కడా వమ్ము చేయకుండా సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా సుపరిపాలన అందిస్తున్నట్లు తెలిపారు. జగనన్న ప్రభుత్వ పాలనలో అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరిగిందన్నారు. వైఎస్సార్ పింఛన్ కానుక, ఆసరా, అమ్మఒడి, చేదోడు, ఈబీసీ నేస్తం, జగనన్న విద్యా దీవెన, వసతి దీవెన, కాపు నేస్తం, సున్నా వడ్డీ పథకం, చేయూత వంటి సంక్షేమ పథకాల ద్వారా డివిజన్ ప్రజలకు ఐదేళ్లలో అక్షరాల రూ. 66.55 కోట్లు అందజేసినట్లు వివరించారు.

వైఎస్సార్ సీపీతోనే డివిజన్ అభివృద్ధి..

గత టీడీపీ ప్రభుత్వంలో కండ్రిక ప్రాంతం ఎటువంటి అభివృద్ధికి నోచుకోలేదని మల్లాది విష్ణు విమర్శించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రూ. 21.97 కోట్ల మేర అభివృద్ధి పనులు చేపట్టినట్లు వెల్లడించారు. రూ. 19.87 లక్షలతో ప్రజాశక్తి నగర్ కమ్యూనిటీ హాల్‌రోడ్డు, రూ. 19.97 లక్షలతో కండ్రిక సెంటర్ వద్ద అయాన్ డిజిటల్ రోడ్డు, రూ. 19.98 లక్షలతో లగడపాటి కల్యాణ మండపం రోడ్డు పూర్తి చేసుకున్నట్లు వివరించారు. రూ. 39.75 లక్షల వీఎంసీ జనరల్ ఫండ్స్‌తో జర్నలిస్ట్ కాలనీ అంతర్గత రహదారులు అభివృద్ధి పరిచినట్లు చెప్పారు. రూ. 4 కోట్లతో కండ్రిక జంక్షన్ నుంచి ముస్తాబాద్ జంక్షన్ వరకు 4.2 కి.మీ మేర బీటీ రోడ్డు నిర్మించగా రూ. 3.50 కోట్ల డీఎంఎఫ్‌టీ ఫండ్‌తో పాతపాడు కండ్రిక గ్రామం నుంచి ఎస్‌ఎస్‌సీ బోస్ నగర్ వరకు నూతన రహదారిని నిర్మించుకున్నట్లు పేర్కొన్నారు. అలాగే రూ. 16.85 లక్షలతో శానిటరీ ఇన్‌స్పెక్టర్ కార్యాలయాన్ని ప్రారంభించుకున్నట్లు తెలిపారు. రూ. 19.98 లక్షలతో విశాలమైన కర్మల భవనాన్ని నిర్మించినట్లు చెప్పారు. ఈ ప్రాంతంలో ఒక నూతన ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌ను సైతం ప్రారంభించినట్లు తెలియజేశారు. ఈ అభివృద్ధి ఇదే రీతిలో కొనసాగాలంటే ఫ్యాన్ గుర్తుపై ఓట్లు వేసి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రి చేసుకోవాల్సిన ఆవశ్యకత ఉందని పేర్కొన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ఎంపీ అభ్యర్థి కేశినేని నాని, ఎమ్మెల్యే అభ్యర్థి వెలంపల్లి శ్రీనివాసరావును అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి మేడా రమేష్, పార్టీ నాయకులు యరగొర్ల శ్రీరాములు, డివిజన్ కోఆర్డినేటర్ షేక్ ఇస్మాయిల్, మాతా మహేష్, చైతన్య, మీసాల రామకృష్ణ, వెంకటేశ్వరమ్మ, వరాలమ్మ, కొక్కిలిగడ్డ నాని, పరిమి నాగేశ్వరరావు, జలసూత్రం శ్రీనివాస్, అనిల్, పల్లి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలే శ్రీరామరక్ష



ఒకటో డివిజన్‌లో ప్రచారం చేస్తున్న కేశినేని పావని, వెలంపల్లి శ్రీలక్ష్మి తదితరులు

గుణదల(విజయవాడతూర్పు): జగనన్న ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలే శ్రీరామరక్ష అని, ఆ పథకాలే వైఎస్సార్ సీపీని తిరిగి అధికారంలోకి తీసుకువస్తాయని ఆ పార్టీ ఎంపీ అభ్యర్థి కేశినేని శ్రీనివాస్ సతీమణి పావని, సెంట్రల్ అభ్యర్థి వెలంపల్లి శ్రీనివాసరావు కుటుంబ సభ్యులు శ్రీలక్ష్మి అన్నారు. స్థానిక ఒకటో డివిజన్ ఊర్మిళానగర్‌లో మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ పాలన సాగిస్తున్నారని తెలిపారు. జగనన్న రూపొందించి అమలు పరుస్తున్న సంక్షేమ పథకాల ద్వారా అన్ని వర్గాల ప్రజలు లబ్ధి పొందుతున్నారని పేర్కొన్నారు. ప్రజలకు అందుతున్న ఈ సంక్షేమ ఫలాలే తిరిగి ప్రభుత్వాన్ని అధికారంలోకి తెస్తాయని ధీమా వ్యక్తం చేశారు. సీఎం జగన్ ఇటీవల విడుదల చేసిన మేనిఫెస్టో సైతం ఆమోదయోగ్యంగా ఉందన్నారు. సంక్షేమ పథకాలు కొనసాగిస్తూ జగనన్న తీసుకున్న నిర్ణయం హర్షణీయమన్నారు. ఎన్నికల్లో ప్రజలు వైఎస్సార్ సీపీని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఒకటో డివిజన్ కార్పొరేటర్ ఉద్దంటి సునీత, వైఎస్సార్ సీపీ నాయకులు కే శివ, వేణు, కోటేశ్వర రెడ్డి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

మధురానగర్(విజయవాడసెంట్రల్): టీడీపీ నేతలకు మహిళలంటే చిన్న చూపు అని వైఎస్సార్ సీపీలోనే మహిళలకు గౌరవం ఉందని వెలంపల్లి శ్రీనివాసరావు కుటుంబ సభ్యులు వెలంపల్లి శ్రీలక్ష్మి అన్నారు. స్థానిక 32వ డివిజన్ రామలింగేశ్వరపేటలో మంగళవారం సాయంత్రం కోఆప్షన్ సభ్యురాలు గుండే సుభాషిణితో కలిసి ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఫ్యాను గుర్తుకు ఓట్లు వేసి వైఎస్సార్ సీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు కేశినేని నాని, వెలంపల్లి శ్రీనివాసరావును అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు గుండే సుందర్‌పాల్, వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సూర్యభగవానుడికి విశేష పూజలు



మధురానగర్(విజయవాడసెంట్రల్): శ్రీ శివజ్ఞాన పీఠంలో మంగళవారం సూర్యభగవానుడికి విశేషంగా మందారం, నూరు వరహాలు, గులాబీ పూలు, శంకు పుష్పములతో పూజలు చేశారు. పీఠాధిపతి శివాచార్యస్వామి పూజా కార్యక్రమాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. సూర్య భగవానుడి ఆశీస్సులు ప్రజలందరికీ అందాలని ప్రజలు సుఖసంతోషాలతో వర్ధిల్లాలని పూజలు చేస్తున్నట్లు తెలిపారు.

300 మద్యం సీసాలు స్వాధీనం



పోలంపల్లి(వత్సవాయి): మండలంలోని పోలంపల్లి పంట పొలాల్లో బస్తాల్లో దాచి ఉంచిన 300 మద్యం సీసాలను ఎక్సైజ్ అధికారులు మంగళవారం స్వాధీనం చేసుకున్నారు. పొలాల్లో మద్యం సీసాలను నిల్వ చేశారనే సమాచారం తెలుసుకున్న ఎస్‌ఈబీ సీఐ మణికంఠ, తన సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించి 300 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. దర్యాప్తులో భాగంగా మద్యం దాచినవారి వివరాలను కనిపెట్టి వారిపై తగిన చర్యలు తీసుకుంటామని సీఐ వివరించారు.

జగనన్న వెంటే నాయీ బ్రాహ్మణులమంతా నడుస్తాం

నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ మల్కాపురం కనకారావు



సమావేశంలో మాట్లాడుతున్న కనకారావు, నాయీ బ్రాహ్మణ సంఘం నాయకులు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): నాయీ బ్రాహ్మణులకు అన్ని రంగాల్లో సముచిత స్థానం కల్పించిన జగనన్న వెంటే రాష్ట్రంలోని నాయీ బ్రాహ్మణులమంతా నడుస్తామని నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ మల్కాపురం కనకారావు పేర్కొన్నారు. సింగ్‌నగర్ ఆంధ్రప్రభకాలనీలోని వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గ కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. దీనిలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని దేవాలయాల పాలక మండలి నుంచి టీటీడీ బోర్డు మెంబర్ల వరకు నాయీ బ్రాహ్మణులకు సముచిత స్థానం కల్పించిన ఘనత సీఎం జగన్‌కే దక్కిందన్నారు. గత ప్రభుత్వాలు నాయీ బ్రాహ్మణులను కేవలం ఓటు బ్యాంకుగా మాత్రమే వాడుకున్నాయని అన్నారు. సెంట్రల్ నియోజకవర్గంలోని నాయీ బ్రాహ్మణులు అంతా వెలంపల్లి శ్రీనివాసరావు గెలుపునకు కృషి చేస్తామని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా వైఎస్సార్ సీపీ అభ్యర్థుల గెలుపునకు తామంతా కష్టపడతామని తెలిపారు. ఆర్.గణపతి రావు, మల్లవరపు నరసింహారావు, రాము పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలతో పేదలందరికీ మేలు

కాపు కార్పొరేషన్ ఛైర్మన్ అడపా శేషు



అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాల ద్వారా నిరుపేద ప్రజలందరికీ మేలు జరిగిందని, ప్రతి ఒక్కరూ జగనన్న నాయకత్వాన్నే మళ్లీ బలపరుస్తారని కాపు కార్పొరేషన్ ఛైర్మన్ అడపా శేషు అన్నారు. వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి వెలంపల్లి శ్రీనివాసరావుకు మద్దతుగా సింగ్‌నగర్ 59వ డివిజన్‌లో మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. స్థానిక కార్పొరేటర్ ఎండీ షాహినాసుల్తానాతో కలిసి ఇంటింటికి తిరిగి వైఎస్సార్ సీపీ మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు. వైఎస్సార్ సీపీ నాయకులు ఎండీ హఫీజుల్లా, చింతా చిన్నా, చింతా శ్రీనివాసరావు, పిల్లి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పేదల పక్షపాతి సీఎం జగన్



28వ డివిజన్‌లో ఓట్లు అభ్యర్థిస్తున్న మల్లాది విష్ణు

మధురానగర్(విజయవాడసెంట్రల్): పేదలకు, పెత్తందారులకు మధ్య జరిగే ఎన్నికల పోరాటంలో పేదల పక్షపాతి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పక్షాన ప్రతి ఒక్కరూ నిలబడాలని రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు పిలుపునిచ్చారు. స్థానిక 28వ డివిజన్‌లో మంగళవారం అయన విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విష్ణు మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలతో ఎక్కడికి వెళ్లినా మంచి ప్రజాదరణ లభిస్తోందని అన్నారు. జనం మళ్లీ వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్నే బలంగా కోరుకుంటున్నారని.. నియోజకవర్గంలో ఎక్కడికి వెళ్లినా ప్రజలు ఎదురొచ్చి స్వాగతిస్తున్నారని తెలిపారు. గత టీడీపీ ప్రభుత్వంలో ఏవిధమైన లబ్ధి పొందని ప్రజానీకం, తమ ప్రభుత్వంలో తాము రూ. లక్షల్లో పొందిన లబ్ధిని స్వయంగా వివరిస్తున్నారని పేర్కొన్నారు. చంద్రబాబు సూపర్ సిక్స్ పేరుతో ఎన్ని హామీలిచ్చినా ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. సీఎం జగన్ అమలు చేసిన సంక్షేమ పథకాలతో 175 ఎమ్మెల్యే స్థానాలు, 25 ఎంపీ స్థానాల్లో వైఎస్సార్ సీపీ ఘన విజయం సాధించడం ఖాయమని స్పష్టం చేశారు. ఫ్యాన్ గుర్తుపై ఓట్లు వేసి ఎంపీ అభ్యర్థి కేశినేని నాని, ఎమ్మెల్యే అభ్యర్థి వెలంపల్లి శ్రీనివాసరావును అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక వైఎస్సార్ సీపీ డివిజన్ ఇన్‌చార్జ్ కనపర్తి కొండ, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు

● ఘనంగా అల్లూరి విగ్రహానికి నివాళులు



బుడమేరు వంతెన సెంటర్‌లో అల్లూరి విగ్రహానికి నివాళులర్పిస్తున్న కేశినేని నాని, వెలంపల్లి



అల్లూరి చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు, శిరీష తదితరులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు స్ఫూర్తితో నేటి యువత దేశానికి సేవ చేయాలని ఎంపీ కేశినేని నాని, ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. స్థానిక బుడమేరు వంతెన సెంటర్‌లో మంగళవారం వైఎస్సార్ సీపీ రాష్ట్ర మహిళా కార్యదర్శి లఖంరాజు సునీత ఆధ్వర్యాన అల్లూరి సీతారామరాజు వర్ధంతి కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో వారు ముఖ్య అతిథులుగా పాల్గొని స్థానిక కార్పొరేటర్ బీ జానారెడ్డితో కలిసి సీతారామరాజు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంపీ కేశినేని నాని మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం జీవితాలను త్యాగం చేసిన ఆ మహనీయుని నుంచి యువత స్ఫూర్తి పొందాలని సూచించారు. వెలంపల్లి మాట్లాడుతూ మన్యం వీరుని ఆశయాలే ఆదర్శంగా యువత ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు వర్మ, వికాస్, పెద్దబాబు అమ్ముల వివేకానంద తదితరులు పాల్గొన్నారు.

మన్యం వీరునికి ఎమ్మెల్యే విష్ణు నివాళి..

గిరిజన హక్కుల కోసం పోరాడి, వారిలో స్వాతంత్ర్య ఉద్యమ స్ఫూర్తిని రగిల్చిన మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు త్యాగం తెలుగు జాతికే గొప్ప గౌరవమని రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. అల్లూరి సీతారామరాజు వర్ధంతి సందర్భంగా బుడమేరు వంతెన వద్ద అల్లూరి సీతారామరాజు విగ్రహానికి కార్పొరేటర్ పెనుమత్స శిరీషతో కలిసి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

ముత్యాలంపాడులో..

ముత్యాలంపాడులోని గోకరాజు రంగరాజు కల్యాణ మండపంలో అల్లూరి సీతారామరాజు సాంస్కృతిక సంఘం, అల్లూరి స్మారక గ్రంథాలయం ఆధ్వర్యాన మంగళవారం అల్లూరి సీతారామరాజు వర్ధంతి సభ జరిగింది. ఈ సందర్భంగా అల్లూరి చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. అనంతరం 300 మందికి అన్నదానం చేశారు. కార్యక్రమంలో మాజీ డెప్యూటీ మేయర్ సామంతపూడి నరసరాజు, సంఘం అధ్యక్షుడు ఎస్ వెంకటేశ్వరరాజు, కార్యదర్శి ప్రసాదరాజు, గ్రంథాలయం అధ్యక్షుడు కే సుబ్బరాజు, డాక్టర్ ఎస్వీ సుబ్బరాజు, కార్యదర్శి పీవీ సుబ్బరాజు, క్షత్రియ సోత్ ఫెడరేషన్ ఉపాధ్యక్షుడు టీవీఎస్ ఆంజనేయరాజు, కోశాధికారి డీజేపీఎన్ రాజు, టీఎస్ఎన్ రాజు, టీ శ్రీనివాసరాజు, సాగి వర్మ, డాక్టర్ రామలింగరాజు, కే సాంబశివరాజు తదితరులు పాల్గొన్నారు.

ఫ్యాను గుర్తుకు ఓట్లు వేసి గెలిపించండి

వైఎస్సార్ సీపీ సెంట్రల్ ఎమ్మెల్యే అభ్యర్థి వెలంపల్లి శ్రీనివాసరావు



63వ డివిజన్‌లో ప్రచారం నిర్వహిస్తున్న వెలంపల్లి శ్రీనివాసరావు

పాయకాపురం(విజయవాడరూరల్): సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాను గుర్తుకు ఓట్లు వేసి తనను, ఎంపీ అభ్యర్థి కేశినేని శ్రీనివాస్(నాని)ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి వెలంపల్లి శ్రీనివాసరావు ఓటర్లను కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం సాయంత్రం 63వ డివిజన్‌లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా వెలంపల్లి మాట్లాడుతూ మీ ఇంట్లో మంచి జరిగితేనే మాకు ఓటు వేయండని అడుగుతున్న ఏకైక నాయకుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఆధీనంలో ఉన్న పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు జగన్‌మోహన్‌రెడ్డి పెంచారని అవగాహన లేకుండా బొండా ఉమా అనడం సరికాదన్నారు. ఫలాన అభివృద్ధి చేశామని చెప్పుకొని ఓటు అడగడానికి కనీస ఒక్క పని కూడా టీడీపీ చేయలేదని ఆరోపించారు. టీడీపీ నేతలు చెబుతున్న మాటలు ప్రజలు నమ్మే పరిస్థితి లేదని పేర్కొన్నారు. రౌడీయిజం, భూకబ్జాలు, గూండాయిజం, కాల్‌మనీ, సెక్స్ రాకెట్స్‌తో సంబంధాలున్న వారిని ఓడించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో డివిజన్ కోఆర్డినేటర్ పసుపులేటి యేసు, మోదుగుల గణేష్, సీహెచ్.రవి, టిక్క్యం కృష్ణ, జిల్లా వైఎస్సార్ సీపీ కార్యదర్శి మేడా రమేష్, రాష్ట్ర మైనార్టీ జాయింట్ సెక్రటరీ షేక్ నాగుల్‌మీరా, ఉద్దంటి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.


కూటమి అభ్యర్థులను చిత్తుగా ఓడించాలి



నియమాక పత్రం అందజేస్తున్న షేక్ నాగుల్ మీరా


పాయకాపురం(విజయవాడరూరల్): సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి అభ్యర్థులను చిత్తు చిత్తుగా ఓడించాలని ఆజాద్ ముస్లిం కమిటీ(ఏఎంసీ) రాష్ట్ర అధ్యక్షుడు షేక్ నాగుల్ మీరా పిలుపునిచ్చారు. 61వ డివిజన్ శాంతినగర్‌లో ముస్లిం మైనార్టీల యువజన కమిటీ సమావేశం మంగళవారం జరిగింది. ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న షేక్ నాగుల్ మీరా మాట్లాడుతూ ముస్లిం మైనార్టీలకు ఉన్న రిజర్వేషన్లు తీసివేస్తామని చెబుతున్న కూటమి రాజకీయ పార్టీల అభ్యర్థులను ఓడించాలన్నారు. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ముస్లిం మైనార్టీ వర్గాలకు చెందిన వారిని నామినేటెడ్ పదవుల్లో అనేక మందిని నియమించారన్నారు. సంక్షేమం పరంగా పెద్దపీట వేశారని అన్నారు. వైఎస్సార్ సీపీ ఎంపీ అభ్యర్థి కేశినేని నాని, సెంట్రల్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి వెలంపల్లి శ్రీనివాసరావును ఫ్యాను గుర్తుపై ఓట్లు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. అదేవిధంగా ముస్లింల సమస్యలను పరిష్కరించేందుకు ఆజాద్ ముస్లిం కమిటీ కృషి చేస్తోందని తెలిపారు. ఈ సందర్భంగా ఏఎంసీ సెంట్రల్ నియోజకవర్గ యూత్ సెక్రటరీగా గాలిబ్ బేగ్‌ను నియమించి ఆయనకు నియమాక పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏఎంసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ సాజిద్ అలీ, ప్రతినిధులు అన్వర్ బేగ్, సిలార్ బేగ్, షేక్ అబ్దుల్లా తదితరులు పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు



భవానీపురం(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై శ్రీదుర్గామల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానంలోని కళావేదికపై మంగళవారం ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు సందర్శకులను అలరించాయి. తెనాలికి చెందిన శ్రీలక్ష్మి కూచిపూడి నృత్య కళా కేంద్రం నిర్వాహకురాలు, నాట్యాచారిణి ఎ.వెంకటలక్ష్మి శిష్యులు మహాగణపతి, నమఃశివాయ, అంబ నీరాజనం, అష్టలక్ష్మి వైభవం, జయ జయ దుర్గ, మార్కేండేయ విజయం, అర్ధనారీశ్వరం హనుమాన్ చాలీసా వంటి అంశాలకు చక్కని ఆహార్యం, అభినయంతో నృత్యం చేశారు. అనంతరం ఆలయ అధికారులు కళాకారిణులకు తీర్థప్రసాదాలు అందజేసి, అమ్మవారి దర్శన భాగ్యం కల్పించారు.

● ఈదురుగాలుల బీభత్సం



బందరు రోడ్డులో కమ్మేసిన కారు మబ్బులు

నగరంలో మంగళవారం సాయంత్రం ఈదురుగాలులు బీభత్సం సృష్టించాయి. ఉదయం నుంచి భానుడి భగభగలతో అల్లాడిన ప్రజలు సాయంత్రం వాతావరణం చల్లబడడంతో సేదతీరారు. సాయంత్రం 4 గంటల ప్రాంతంలో ఈదురుగాలులు వీచి, కారు మబ్బులు కమ్మేశాయి. కొన్ని ప్రాంతాల్లో ఫ్లెక్సీలు ఊడిపోయాయి. పంటకాలువ రోడ్డులో చెట్ల కొమ్మలు విరిగిపడ్డాయి.

–ఆటోనగర్(విజయవాడతూర్పు)



గాలులకు నిర్మానుష్యంగా మారిన పంటకాలువ రోడ్డు